

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

డీఈవో మాధవి



పెద్దబొంకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దబొంకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించి బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థికి చదవడంలో వచ్చే సమస్యల్ని నివృత్తి చేయాలన్నారు. స్లిప్ టెస్ట్‌లకు ప్రతీ విద్యార్థి హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని, ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తీర్ణత సాధించాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు సౌమ్య, వెంకటరమణ, శంకరయ్య, మమత, మల్లిఖార్జున్, మంగ, ఇంతియాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’లో పూడికతీత పనులు వద్దు

- రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి
- జిల్లా అధికారులకు ఉన్నతాధికారుల ఆదేశాలు
- మార్చి నెలాఖరు వరకు 2.56 లక్షల పని దినాలు పూర్తి చేయాలి



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉపాధి హామీ పథకం ద్వారా ఇచ్చిన పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చి నెలాఖరులోగా కూలీలకు ఇంకా 2 లక్షల 56 వేల పని దినాలను కల్పించాల్సి ఉంది. చెరువులు, కుంటల్లో, కాలువల్లో పూడికతీత పనులు గాకుండా రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. పూడికతీత పనుల వల్ల పెద్దగా ఉపయోగం లేదని, యేటా పూడికతీత పనులు చేపడుతున్నా మళ్లీ మళ్లీ అవే పనులు చేయడం వల్ల ఇతరత్రా పనులు ముందుకు సాగడం లేదని ఉన్నతాధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవల పంచాయతీ రాజ్ శాఖాధికారులు జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు.

జిల్లాలో 1,19,000 కుటుంబాలకు ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులను జారీ చేశారు. ఈ కార్డులపై 2,48,000 మంది కూలీలు ఉన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ప్రభుత్వం 25 లక్షల 55 వేల పని దినాలను కేటాయించింది. యేటా అక్టోబర్, నవంబర్ నెలల్లో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఉపాధిహామీ కూలీలకు పనులను గుర్తిస్తారు. ఆ మేరకు షెల్‌లో ఉంచి ఆ పనులను ఏప్రిల్ 1వ తేదీ నుంచి కల్పిస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు 22 లక్షల 99 వేల పని దినాలను కల్పించారు. ఇంకా 2 లక్షల 56 పని దినాలను మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలి. ఇప్పటి వరకు 81 కోట్ల 53 లక్షల 41 వేల రూపాయలను ప్రభుత్వం వెచ్చించింది. ఇందులో కూలీలకు వేతనాల రూపేణా 52 కోట్ల 38 లక్షల 14 వేల రూపాయల విలువైన పనులు కల్పించారు. మెటీరియల్ కంపొనెంట్ కింద 24 కోట్ల 39 లక్షల 21 వేల రూపాయలు వెచ్చించారు. నిర్వహణ కింద 4 కోట్ల 76 లక్షల 6 రూపాయలు వెచ్చించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఇంకా 2 లక్షల 56 వేల పని దినాలు మిగిలి ఉన్నాయి. ఈ పని దినాలలో ఫామ్ పాండ్స్ తవ్వకాలు, పర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణం, రైతులకు పొలం బాటలు, నర్సరీల్లో మొక్కల పెంపకానికి, ఎస్సీ ఎస్టీలకు చెందిన భూముల అభివృద్ధి పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మెటీరియల్ కంపొనెంట్ కింద క్యాటిల్ షెడ్లు, పౌల్ట్రీ షెడ్లు, వర్మీ కంపోస్టు పిట్లు, చెక్ డ్యామ్‌లు, బోర్‌వెల్స్ రీచార్జ్ స్ట్రక్చర్లు, సోక్ పిట్లు, ఓపెన్ వెల్స్ బావుల తవ్వకాల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి మండలానికి రెండు పశువుల దాణా యూనిట్స్‌ను ఆదర్శ రైతులచే ఏర్పాటు చేసేందుకు మండల వ్యవసాయ విస్తీర్ణాధికారులచే అవగాహన కల్పించాలని, మండలానికి ఒక ఒక పౌల్ట్రీ షెడ్ నిర్మించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు సూచించిన మేరకు ఉపాధి పనులు చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించారు.

మున్సిపల్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్, ట్రేడ్ లైసెన్స్ వివిధ మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పెద్దపల్లి పురపాలక భవనాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. పురపాలక విభాగంలోని ప్రతీ సెక్షన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్, ట్రేడ్ లైసెన్స్ మేళాలను కలె క్టర్ సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడు తూ పట్టణంలో వంద శాతం ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలన్నారు. వార్డు అధికారులు మున్సిపల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, క్షేత్ర స్థాయిలో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వేసవి కాలంలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్స్ ఏర్పాటు



వెండింగ్ జోన్స్ కోసం పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయనున్నట్టు కమిషనర్ అరుణశ్రీ చెప్పారు. కార్పొరేషన్‌లలోని వివిధ డివిజన్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గోదావరిఖని బస్టాండ్, సప్తగిరికాలనీ ప్రాంతాలను పరిశీలించి అక్కడ వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మార్కండేయ కాలనీలోని ఆక్రమణకు గురైన నాలాను పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పీకే రామయ్య కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించిన డైనింగ్ హాల్‌ను వినియోగంలోకి తేవాలన్నారు.

రాష్ట్రంలో గాడి తప్పిన పాలన



సమావేశంలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే ప్రజలను మభ్యపెట్టేలా పాలన చేస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ చెల్లింపు, పీఆర్సీ అమలు హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగుల భవిష్య నిధి చెల్లింపులో జాప్యం చేయడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మభ్యపెడుతోందని, ఉద్యోగాల నియామకాలు సరిగా జరగడం లేదని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టభద్రులు, ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిలను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఏకతాటిపై నిలిచి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అల్లాపూర్ శ్రీనివాస్, సురభి నవీన్‌రావు, ఆరుముల్ల పోచం, కందుల సంధ్యారాణి, అంజనేయులు, పర్వతాలు, సదానందం, రాకేశ్, ఫహీమ్ పాల్గొన్నారు.



పుల్వామా అమర జవాన్లకు నివాళి

- బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ

8



అంజన్న ఆలయ భూములు పక్కదారి

- భూముల్లో మున్సిపాలిటీ పాగా
- గోశాల పేరిట మరి కొందరు

7

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి స్థానాలకు ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి వేణు అన్నారు. ఈనెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఉపాధ్యాయ పోటీలో 19 మంది, పట్టభద్రుల స్థానానికి 56 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 14, పట్టభద్రుల ఎన్నిక కోసం 36 పోలింగ్ కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల జాబితా ప్రకారం బ్యాలెట్ బాక్స్‌లు కేటాయించాలని, అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వహించే రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా డబ్బు, మద్యం, ఆభరణాలు పంపిణీ చేయకుండా నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన మైక్రో అబ్జర్వర్లను కేటాయించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. పెద్దపల్లి అమర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుతుందన్నారు. పోలింగ్ రోజు ప్రతీ రెండు గంటలకు ఒకసారి వివరాలను ప్రకటించాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా అటవీ అధికారి శివయ్య, సూపరింటెండెంట్ ప్రకాష్, రవాణా శాఖ అధికారి రంగారావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి, రాగినేడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తుర్కలమద్దికుంట, పాలితం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమతు కారణంగా సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూరియా కోసం రైతులు ఆందోళనపడొద్దు



యూరియాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పెద్దపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, జిల్లాలో 3323 టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు వ్యాగన్‌లో వచ్చిన యూరియాను పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ సీజన్‌లో వరి, మొక్కజొన్న రెండు లక్షల 23 వేల ఎకరాల్లో సాగు చేశారని పేర్కొన్నారు. ప్రయివేట్ డీలర్ల వద్ద 979 టన్నులు, సహకార సంఘాల్లో 74 టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 1575 టన్నులు, వేర్‌హౌస్‌లో 65 టన్నులు, మొత్తం 3323 టన్నుల యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మార్చి వరకు జిల్లాకు 8440 టన్నుల యూరియా రావాల్సి ఉందని తెలిపారు.

వైభవంగా నంబులాద్రి స్వామి రథోత్సవం

7





చేతులెత్తేస్తున్నారు..

- గోదావరిఖనిలో కోట్ల రూపాయలతో ఉడాయిస్తున్న వ్యాపారులు
- అయోమయంలో బాధితులు
- రోజూ పోలీస్‌స్టేషన్లలో ఐదారు అప్పుల కేసులు

గోదావరఖని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ళుగా వ్యాపారం చేస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించారు.. అలాంటి వారు చేతులెత్తేయడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు వ్యాపారులు ముందస్తుగా ఐపీ దాఖలు చేసి దర్జాగా తిరుగుతున్నారు.

రెండు మాసాల క్రితం స్థానిక తిలక్‌నగర్ ప్రాంతంలో ఓ కిరాణాషాపు నడుపుతున్న వ్యాపారి రాత్రికి రాత్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. ఏళ్ల తరబడి కిరాణా షాపు నడిపిన ఈ వ్యాపారిని నమ్మిన కార్మిక కుటుంబాలు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చారు. సదరు వ్యాపారి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద సుమారు రూ.5కోట్ల వరకు అప్పులు చేసి ఉడాయించాడు. తెల్లవారే సరికి ఇంట్లో మనుషులు, షాపులో సామాను లేదు.

కళ్యాణ్‌నగర్ ప్రాంతంలోని ఓ చిరు వ్యాపారి రూ.5కోట్ల వరకు అప్పు చేసి చేతులెత్తాడు. అప్పులిచ్చిన వాళ్లు ఒత్తిడి చేయడంతో తన స్వగ్రామం వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్యానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రుణ దాతలు ఆందోళన పడ్డారు. సదరు వ్యాపారి ఆరోగ్యం కుదుట పడిన తరువాత ఆస్తులు విక్ర యించగా వచ్చిన డబ్బులు 20శాతం చొప్పున చెల్లించి సెటిల్ మెంట్ చేసుకున్నారు.

మార్కండేయకాలనీకి చెందిన ఓ బిల్డర్ చిట్టీవాళ్లకు, రుణ దాతలకు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందారు. రుణ దాతలు అతన్ని పిలిపించి ఇల్లును అమ్మి వచ్చిన పైకాన్ని పర్సంటేజీల వారీగా తీసుకున్నారు.

ఇటీవల లక్ష్మీనగర్‌కు చెందిన ఒక బులియన్ వ్యాపారి రూ.10కోట్లతో ఉడాయించాడు. సదరు వ్యాపా రికి లక్షల్లో అప్పులు ఇచ్చిన వారు, బంగారం కొను గోలు కోసం డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమం టూ షాపు ఎదుట నిరసనలు వెల్లిబుచ్చారు. బులి యన్ వ్యాపారి ఎటువెళ్లాడనేది అంతుచిక్కని ప్రశ్న.

ఇలా రోజుకో సంఘటన ఈ ప్రాంతంలో వెలుగు చూస్తున్నది. వెలుగు చూడని అనేక ఆర్థిక లావాదేవీల సంఘటనలు కోకొళ్లలుగా ఉన్నాయి. గోదావరిఖని ప్రాంత ఠాణాల్లో ఆర్థిక లావాదేవీల వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాలతో పారిశ్రామిక ప్రాంతంలో అవసరాల రీత్యా లావాదేవీలు తగ్గిపోయాయి. అత్యవసరం ఉండి డబ్బు కావాలంటే పుట్టే పరిస్థితులు లేకుండా పోయాయి. కొందరు డబ్బులు అప్పుగా ఇవ్వడం, గిరిగిరి వ్యాపారాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే డబ్బు అవసరం ఉన్న వాళ్ల బలహీనతను, ఒత్తిడిని ఆసరా చేసుకుని 5 నుంచి 8శాతం వరకు మిత్తి ఆశించడం వల్ల అప్పు తీసుకున్న వ్యక్తులు అసలు చెల్లించే స్థాయి నుంచి మిత్తి కూడా కట్టలేని స్థితి ఏర్పడుతోంది. ఉద్యోగస్థులు తగ్గడం, ఇక్కడి మార్కెట్‌లో కొనుగోళ్లు కూడా గణనీయంగా పడిపోవడం, చేతులెత్తేస్తున్న సంఘటనలు పెరగడంతో గోదావరిఖనిలో ఆర్థిక లావాదేవీలు తగ్గిపోతున్నాయి. అప్పు తీసుకుంటే కానీ వ్యాపారం నడపలేని చిరు వ్యాపారస్థులు తమ దుకాణాలను మూసివేసు కుంటున్న సంఘటన కోకొల్లలు. ఈ ఆర్థిక పరిణామాలు ఇక్కడి సామాజిక పరిస్థితులపై తీవ్రంగా ఉన్నాయి. పోలీసులు కూడా ఇది సివిల్ మ్యా టర్ కావడం, చట్ట పరమైన లావాదేవీలు కాక పోవడంతో ఏమి చేయలేకపో తున్నారు. లక్ష్మీనగర్ మార్కెట్‌లో కూల్చివేతల కారణంగా షాపులు మూసివేయడంతో గిరిగిరి వ్యాపారాలు చేసే రుణదాతల పరిస్థితి ఆందో ళనలో పడింది. దీంతో అప్పులు ఇచ్చిన వాళ్లు తీసుకున్న వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ పరిణామాలు పరస్పర గొడవలకు దారి తీస్తున్నాయి. మొత్తంగా పారిశ్రామిక ప్రాంతంలో ఆర్థిక అంశం చర్చకు వస్తున్నది.



వ్యాపారి వెళ్లిపోవడంతో బులియన్ మార్కెట్‌లోని షాపు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య



భారతపు జల(ఫైల్)

జగిత్యాలరూరల్,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు జల(43) అనేవివాహిత అప్పుల బాధతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపినవివరాల ప్రకారం.. భారతపు జల-శ్రీనివాస్ భార్యభర్తలు కొన్నిరోజులుగా అప్పులబాధతో మన స్తాపం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గతనెల28వతేదీన జగిత్యాలరూరల్ మండలంలోని బాలపల్లి శివారులో గల తమ వ్యవసాయ పొలం వద్ద భార్యభర్తలు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మృతురాలు జల కుమారుడు ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందినతండ్రి శ్రీనివాస్ పరిస్థితి మెరుగుపడగా ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తల్లి జల పరిస్థితి విషమించడంతో కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించి శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..
చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కడెం తిరుమలేష్ (37) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం తిరుమలేష్ ఈనెల 11న తన పనిలో భాగంగా తన స్వగ్రామం తిమ్మాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వరపేట గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించారు. వరద కాలువకు అనుకోని ఉన్న పంపుహౌజ్ ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తి ఒంటిపై లేత వంకాయ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న..
కాపర్‌వైర్ దొంగల అరెస్ట్



పట్టుపడిన కాపర్ వైర్ దొంగలు

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వరుస కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్నినెలలుగా రామగిరి, మంథని అంతర్గాం మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఊరికి దూరంగాఉంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకొని అందులోని కాపర్‌వైర్‌ను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన మోటం దేవేందర్, మోటం రాంబాబు, సజ్జశిరీష, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన ఇప్ప గంగాధర్, పరతం రాములును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 35 కిలోల కాపర్‌వైర్, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన
నలుగురిపై కేసు నమోదు

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన ఎండీ మజీద్‌ను చంపుతామని బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12న మజీద్‌ను మండలంలోని చెందోళి గ్రామానికి చెందిన కటారి వంశీ, అశ్విన్ రావు, గుల్లకోట సత్యం, దావు తిరుపతి అనే నలుగురు వ్యక్తులు ఫోన్‌లో తిట్టారన్నారు. చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చి బాధితుడిని బూతులు తిడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్‌కేసులో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులకు పట్టుబడగా జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. గత సంవత్సరం డిసెంబరు 28న చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులో ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ తిరుపతి పట్టుబడ్డాడు. అతడికి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 550/120 ఎంఎల్ రీడింగ్ రావడంతో అతడిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిరుపతిని కోర్టులో హాజరు పరచగా ఈ మేరకు స్పెష్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

చెక్ పోస్టు తనిఖీ




చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోభాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు కల్వచర్ల ప్రధాన రహదారి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎస్ఐ చంద్రకుమార్‌లు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డులను తనిఖీ చేపట్టారు.

కూలీలకు వరం
జన్‌మన్ నరేగా





- అరచేతిలో ఈజీఎస్ సమాచారం
- అందుబాటులోకి కొత్త యాప్
- పారదర్శకత, నిధుల దుర్వినియోగానికి చెక్

చొప్పదండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేలా దీనిని రూపొందించారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పని, వేతనం వివరాలు, గ్రామాలలో ఉపాధి పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాధి కూలీలకు యాప్ వరంగా మారనుంది.

కూలీల వేతనాల దుర్వినియోగానికి చెక్

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పనిచేశారో తెలియదు. ఉపాధిహామీ సిబ్బంది రాసిందే పని, వచ్చిందే వేతనం అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారో ఈ యాప్ ద్వారా కూలీలకు పూర్తిగా తెలుస్తుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లో జన్‌మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఆరు రకాల ఆప్షన్లు ఉంటాయి. మొదట ఆప్షన్‌ను నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్‌కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలను కనిపిస్తాయి.

జాబ్‌కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అటెండెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు, ఎన్ని రోజులు పనిదినాలు మిగిలి పోయాయనే వివరాలు కనిపిస్తాయి.

దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా చేయాల్సిన పని దినాలు కనిపి స్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు, ఎక్కడ పనిచేశారు. కూలీ ఎంత, ఎప్పుడు వారి ఖాతాల్లో జమ చేశారు, ఏ బ్యాంకులో జమ చేశారనే వివరాలు కనిపిస్తాయి. ఉపాధిహామీ డబ్బులు జమకాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్) లింకు అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింకు అయితే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగులో తప్పు గుర్తు ఉంటుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇసుకను తరలిస్తున్న గన్నేరువరం మండలం చొక్కరావుపల్లె గ్రామానికిచెందిన కాంపల్లిరవిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లుపేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్(52) అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ శనివారం సాయంత్రం కల్లుతీయడానికి తాటి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. గాయాలపాలైన శ్రీనివాస్ గౌడ్‌ను కరీంగనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6900 పలికింది. మార్కెట్ యార్డుకు 16మంది రైతులు 150క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.6900, కనిష్ఠ ధర రూ.5400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తాను నిర్జీవం..అవయవాలు సజీవం

- యువ రైతు బ్రెయిన్‌డెడ్
- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



ముస్కు రాజేందర్‌రెడ్డి (ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి (35) అనేయువరైతు బ్రెయిన్‌డెడ్ కాగా కుటుంబసభ్యులు రైతు అవయవాలను దానంచేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఈనెల 10వతేదీన తల తిరుగుతోందని స్పృహతప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని ఆపరేషన్ చేశారు. అనంతరం వైద్య పరీక్షలకు హైదరాబాద్‌కి పంపించగా అక్కడ పరిశీలించిన వైద్యులు అతడు బ్రెయిన్ డెడ్‌ఐ అయినట్టు నిర్ధారించారు. ఎనిమిది రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తాను చనిపోయినా ఎనిమిది మంది ప్రాణాలు నిలిపాడు. యువరైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థుడు

ముత్తారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో తాడిచర్ల బ్లాక్1,2 ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందలాదిలారీలలో ఇసుకను తరలిస్తుండడంతో దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కర్రె రాంచంద్రం అనే వ్యక్తి శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపాడు. రహదారిపై మంచం వేసుకొని పడుకొని ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా తాడిచర్ల బ్లాక్1,2 ఇసుకక్వారీ నుంచి వందలాది లారీలతో ఇసుకను తరలిస్తుండడంతో ఇండ్లలోకి దుమ్ముధూళి చేరుతోందన్నాడు. తాగే నీటిలో, తినే అన్నంలో దుమ్ము పడుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. లారీలు రాకపోకలతో రహదారి పూర్తిగా దెబ్బతిని మట్టి రోడ్డును తలపిస్తుందని అన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక క్వారీలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని పక్కకు తప్పించారు.

నకిలీ ధ్రువపత్రాలతో భూ విక్రయం

- 13 మందిపై కేసు నమోదు
- నలుగురు నిందితుల అరెస్టు



నిందితులను కోర్టుకు తీసుకెళ్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇతరుల భూమికి నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి, తప్పుడు హద్దులు చూపుతూ పలువురికి విక్రయించిన కేసులో ఎస్ఆర్ఎస్‌పీకి చెందిన ఇద్దరు అధికారులతోపాటు మరో 11 మందిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. ఈకేసులో నిందితులుగాఉన్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్‌కుచెందిన సర్వేనంబరు 954లో వావిలాలపల్లికి చెందిన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఆయన తల్లి సత్యవతి పేరిట 6 ఎకరాల 18 గుంటల భూమి ఉండగా ఇందులో నుంచి 34మందికి 4ఎకరాల వరకు ఇతరులకు విక్రయించాడు. మిగిలిన 2ఎకరాల 18 గుంటల భూమిలో ఎకరం 20గుంటల భూమిని మానేరు బైపాస్ రోడ్డు కోసం ప్రభుత్వం తీసుకుంది. ఇంకా దాదాపు 38గుంటల భూమిమిగిలి ఉంది. ఆయన అమెరికా వెళ్లారు. అదేసర్వే నంబరులో వెంకటేశ్వరరావు భూమిని ఆనుకుని పంతంగి రాంచందర్‌రావుకు 11గుంటల భూమి ఉంది. వెంకటేశ్వరరావు అమెరికాలో ఉంటున్నవిషయం తెలుసుకున్న బల్మూరి రమణారావు, దాసరి బుచ్చిరామిరెడ్డి, మహ్మద్ బషీర్ కలిసి ఒకముఠాగా ఏర్పడి వెంకటేశ్వరరావుకు చెందిన 38గుంటల భూమిని కాజేయాలని పథకం రచించారు. ఈ మేరకు పంతంగి రాంచందర్‌రావు భూమిని అధిక ధరకు కొనుగోలు చేస్తామని ఆశచూపి, 2014లో 41 గుంటల భూమిని 10మంది పేరిట రాంచందర్‌రావుతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వెంకటేశ్వరరావు 2022లో తనభూమిపై ఈసీ కోసం దరఖాస్తు చేయగా 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నో ఆబ్జెక్షన్(ఎన్ఓసీ) సర్టిఫికెట్ ఇవ్వడంలో ఇద్దరు అధికారులు సహకరించారు. దీనిపై బాధితుడైన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేయగా తప్పుడు పత్రాలతో 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ నేరానికి పాల్పడిన రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రాంచందర్‌రావు(83), కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్(54), కట్టరాంపూర్‌కుచెందిన బొల్లవేణి శంకర్(64), జ్యోతినగర్‌కుచెందిన బల్మూరి విజయ్‌కుమార్(46), గణేష్‌నగర్‌కుచెందిన దేశవాణి శంకర్(71), జగిత్యాలజిల్లా ఎండపల్లికి చెందిన మంతెన నర్సయ్య(54), కరీంనగర్ రాఘవేంద్రనగర్‌కు చెందిన నందికొండ మురళీధర్‌రెడ్డి(64), తిరుమలనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసరెడ్డి(40), మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు(50), గణేష్‌నగర్‌కు చెందిన దాసరిసంజీవరెడ్డి(38),దాసరి బుచ్చిరాంరెడ్డి(67)తోపాటు ఎస్ఆర్ఎస్‌పీకిచెందిన ఇద్దరు అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

నిందితుల్లో బల్మూరి రమణారావు, దాసరి సంజీవరెడ్డి, దాసరి బుచ్చిరాంరెడ్డి, మొహమ్మద్ బషీర్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని, ఎస్ఆర్ఎస్‌పీ అధికారులపై విచారణ కొనసాగుతోందని సీఐ వివరించారు.

పూరిగుడిసె దగ్ధం



దగ్ధమైన పూరిగుడిసె

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నుంచి వ్యాపించిన మంటలు పూరిగుడిసెకు అంటుకోవ డంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు గ్రామానికి చెందిన శాఖపురపు లక్ష్మి గృహానికి అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఇంట్లో నగదు 50వేల రూపాయలతో పాటు, సామగ్రి కాలిబూడిద అయిందని బాధిత మహిళ లక్ష్మి తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనావేసి పైఅధికారులకు నివేదించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.

దళితుడిపై దాడి హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనం నడిపాడని తమిళనాడులో దళిత యువకుడిని అగ్రవర్ణాలవారు రెండు చేతులు నరికి వేయడం హేయమైన చర్య అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. దళితుడిపై దాడికి నిరసనగా జగిత్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కొత్త చట్టాలు రూపొందించి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. కేవం ఓట్ల కోసం, సీట్ల కోసం దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మద్దెల నారాయణ, తోట జగన్, సూరమల్ల సతీష్, రాజారత్నం, చంద్రయ్య, పుట్ట గంగాధర్, జక్కుల దేవయ్య, నర్ర రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యవ్యస్థ కుంటుపడిపోయిందని ప్రభుత్వం వెంటనే మంత్రి నియమించడంతోపాటు పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించడంతోపాటు పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్స్ కోసం కళాశాల యాజమాన్యాలు డబ్బులు కడితేనే ఇస్తామని వేధింపులకు గురిచేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అప్పులు చేసి డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్‌లను తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కుమార్, అజయ్, నిఖిల్, సమీర్, సంజయ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో లాభాలు

- కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్లో డిమాండ్



కాట్రపల్లిలో నాటుకోళ్ల షెడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గతంలో బంధువులేవరైనా ఇంటికివస్తే పెంచుకున్న కోళ్లను కోసి వండిపెట్టేవారు. కాలక్రమేనా నాటు కోళ్ల పెంపకం కనబడకుండా పోయింది. చాలామంది బ్రాయిలర్‌కోళ్లకు అలవాటు పడ్డారు. అయితే ఇటీవల బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోందని పుకార్లు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. ఒక నాటుకోడి గుడ్డును రూ.10 నుంచి 12వరకు విక్రయిస్తున్నాడు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన అల్లి సత్యరాజ్ అనేవ్యక్తి గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచేవాడు. లాభాలు తక్కువ వస్తున్నాయనే ఉద్దేశ్యంతో అదే షెడ్డులో నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఏడాది క్రితం వెయ్యి నాటు కోళ్లను తీసుకురాగా, లాభాలు వచ్చాయి. దీంతో మళ్లీ నాటు కోడి పిల్లలను తీసుకువచ్చి పెంచుతున్నాడు. ఈ కోళ్లకు ఆహారంగా దానతో పాటు పచ్చికారాగాయలు అందిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో నాటుకోడి రూ.400 పైన ఉన్నా ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. హుజూరాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల ప్రజలు వచ్చి నాటుకోళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఈకోళ్ల బాగోగులు చూసుకోవడం కోసం ఇద్దరు పనివారిని పెట్టుకున్నాడు. ఈపెంపకం గురించి తెలియడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆసక్తిగల పౌల్ట్రీ రైతులు వచ్చి సత్యరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

వెయ్యి నాటు కోళ్లు పెంచుతున్నా..
- అల్లి సత్యరాజ్, పౌల్ట్రీ రైతు, కాట్రపల్లి



నాటు కోళ్ల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచడంతో ఆర్థికంగా నష్టపోయాను. ప్రస్తుతం వెయ్యి నాటు కోళ్లను పెంచుతున్నాను. మరో 15రోజుల్లో ఇంకో వెయ్యి కోళ్లను పెంచేందుకు షెడ్లను ఏర్పాటు చేస్తున్నాను. నాటు కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో కోడి రూ.400లకు విక్రయిస్తుండగా, గుడ్డును రూ.10నుంచి 12కు విక్రయిస్తున్నాను.


సుల్తానాబాద్‌లోని పెరికెగిద్ద అంజన్న ఆలయం

అంజన్న భూములు పక్కదారి

- ఆలయ భూముల్లో మున్సిపాలిటీ పాగా
- గోశాల పేరిట మరి కొందరి ఆధీనం
- ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోని అర్చకుడు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): అంజన్న ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాదాయశాఖ అధికారుల ఉదాసీనత వల్ల ప్రభుత్వ పరమయ్యాయి. ఆలయానికి భూములు ఉండడంతో అర్చకుడికి ధూపదీప నేవైద్యం స్కీంకు నోచుకోవడం లేదు. దాతలపై ఆధారపడి అర్చకులు కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపాలిటీ కొన్ని ఎకరాలను అనధికారికంగా తమ ఆధీనంలోకి తీసుకొంది. అందులో మామిడి తోట పెట్టారు కానీ ఏనాడూ ఆదాయం సమకూరిందీ లేదు. పూత, కాత లేదంటూ వచ్చిన ఫల సాయం కూడా మున్సిపాలిటీ వారే పంచుకుంటున్నారు.

సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామి ఆలయం గతంలో ప్రాచుర్యంలో ఉండేది. 1961లో అప్పటి పుర ప్రముఖులు ఆకుల మల్లయ్య, నారాయణ, సాదుల వెంకటనర్సయ్య తదితరులు సర్వే నంబరు 779లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేశారు. ఆలయ పరిధిలో దాదాపు పది ఎకరాలకు పైగా భూములు ఉండేవి. భూముల సాగు ద్వారా ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఆలయం ఊరికి దూరంగా ఉండడం, ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురైంది. దీంతో క్రమంగా ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పెద్ద ఎత్తున ఉండడంతో నాలుగు ఎకరాలలో స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. దాన్ని సాకుగా తీసుకుని కొందరు భూములను తమ ఆధీనంలోకి తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. 2016లో అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టడంతో ఐదు ఎకరాల అంజన్న భూములను తీసుకున్నారు. ఇప్పటికి మున్సిపాలిటీ ఆధీనంలోనే భూములున్నాయి. ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయం ముందున్న రోడ్డు, ఐసీడీఎస్ ఆఫీసు పక్కన ఉన్న మంచినీటి బావి కూడా ఆలయ భూముల కిందకే వస్తుంది. ఇలా ఆలయ భూములు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ పరంగా ధూప దీప నైవేద్యాల స్కీంలో అర్చకుడికి రావాల్సిన గౌరవ వేతనం రాకుండా ఆలయ భూములు అడ్డుపడుతున్నాయి. కొన్నేళ్లు ఆలయం నిరాదరణకు గురై ధూపదీప నైవేద్యాలకు కూడా నోచుకోలేదు. దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో మళ్లీ భక్తుల రాకపోకలు కొనసాగుతున్నాయి. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకుని అంజన్న ఆలయ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆలయ భూముల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని మామిడిచెట్లు

ఆలయ భూములు పరిరక్షించుకుంటాం

ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి

అంజన్న ఆలయం పరిధిలో పది ఎకరాల వరకు ఉంది. అందులో కొన్ని ఎకరాలు స్మశాన వాటికకు తీసుకున్నారు. అలాగే మున్సిపాలిటీ అనధికారికంగా ఐదెకరాల వరకు తీసుకొంది. ఇటీవల గోశాల పేరిట మరికొంత భూమి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆలయ భూములు లేకుండా పోయాయి. ఐసీడీఎస్ ఆఫీసు పరిధిలోని బావి వరకు, ఆలయం ముందు ఉన్న రోడ్డులో కూడా ఆలయ స్థలం పోయింది. ఆలయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూస్తాం.

చర్యలు తీసుకుంటాం

సుజాత దేవాదాయ శాఖ అధికారిణి

సుల్తానాబాద్‌లోని అంజన్న ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. మామిడితోట పెంచుతున్న భూములు దేవాదాయ శాఖకు చెందినవే. అధికారికంగా తాము ఎవరికీ బదలాయించలేదు. ఇటీవల నోటీసులు కూడా ఇచ్చాం. అర్చకునికి ధూప దీప నైవేద్యం స్కీం ద్వారా లబ్ధి చేకూర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ఆలయ భూములు కాపాడుకోవాలి

పల్లా మురళి వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్

పెరికె గిద్ద అంజనేయ స్వామి ఆలయానికి పది ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి ఇతరుల పాలయ్యాయి. ఆలయం, ఆవరణ మాత్రమే గుడి పరిధిలో ఉన్నాయి. మిగతా ఎకరాల కొద్దీ భూములు స్మశాన వాటికకని, చెట్ల పెంపకం కోసం అని తీసుకున్నారు. ఆలయ భూములను కాపాడుకోవాలి.

వైభవంగా భీమేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన జాతర రథోత్సవంతో ముగిసింది. రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, మల్లాపూర్, జగిత్యాల మండలాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ సమీప ప్రాంతం కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి క్యూలో నిల బడి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపైకి చేర్చారు. వేలాది మంది భక్తులు పోటీపడి దేవాలయం చుట్టూ ఐదుసార్లు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

నంబులాద్రి స్వామి రథోత్సవం

జాతరకు కిక్కిరిసిన భక్తులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామం లోని లక్ష్మీ నంబులాద్రి స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మీ నంబులాద్రి స్వామి వారలను మంగళవాయిద్యాలతో, పండితుల వేద మంత్రాలతో, మహిళల మంగళహారతులతో ఆలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న రథంపై ప్రతిష్టించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

రథంపై ఉన్న స్వామి వారిని, ఆలయం లోపల ఉన్న మూల మూర్తి దర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ఈ నెల 8న స్వామి వారి కల్యాణోత్సవంతో నంబులాద్రి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారం భమయ్యాయి. శుక్రవారం రథోత్సవం జాతరతో ముగిసాయి. పలు జిల్లాలతోపాటు వైష్ణవ ఆళ్వార్లు ఎక్కువగా ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ర్టాల నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ఆట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్నదానం, పులిహోర తాగునీటి వసతి కల్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, సాగర్‌రావు, సంతోష్‌రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్ తదితరులు పాల్గొని స్వామిని దర్శనం చేసుకున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బా రెడ్డి, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సబ్ డివిజన్ నుంచి పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.


దేవునిపల్లి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథాన్ని లాగుతున్న భక్తులు

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి


ఎస్‌యూ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో రెండు ఫార్మసీ కళాశాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు డిటెన్షన్ అవడం, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు లేకపోవడం వంటి వాటితో ఫార్మసీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శి సంఘం గణేష్, జిల్లా నాయకులు అభిలాష్, ఉమేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో శుక్రవారం భక్తుల తాకిడి పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మ గుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు అనంతరం శ్రీబద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.




భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా వన మహోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారు ఏకాంతంగా విహార యాత్రకు వెళ్లేందుకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పండితులు పేర్కొన్నారు. గుట్ట కింది వనంలోకి గజవాహనంపై స్వామివారిని మేళతాళాలతో తీసుకువెళ్లి వనాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనాల వద్ద అటవీశాఖ అధికారులను, అర్చకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ జడ్పీటీసీ ముప్పాల జలజ, మాజీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసి స్టెంట్ రఘు, అటవీ శాఖ సెక్షన్ అధికారులు గంగారాం, ప్రకాష్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల్లో భాగంగా వనమహోత్సవంలో పాల్గొన్న అర్చకులు, పోలీసులు

రాజన్న ఆలయంలో రెండో భారీ ఫ్యాన్



వేములవాడ కల్చరల్ ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం శుక్రవారం రాత్రి ఈవో కె.వినోద్‌రెడ్డి నాగిరెడ్డి మండపం సమీపంలో రెండో భారీ ఫ్యాన్ ఏర్పాటు చేశారు. వేసవి సమీపిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఫ్యాన్ ఏర్పాటు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సన్నాహక సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించడంతో ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈ రామ్ కిషన్‌రావు, పర్యవేక్షకులు వరి నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

రాజన్న కోడె దాడిలో భక్తురాలికి గాయాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలిని శుక్రవారం కోడె గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చింది. కోడె మొక్కు చెల్లించుకునే సమయంలో ఆకస్మాత్తుగా కోడె దాడి చేయడంతో ఎల్లవ్వకు తీవ్ర గాయమైంది. దీంతో 108 ద్వారా ఎల్లవ్వను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎల్లవ్వ ఎడమ కాలికి బలమైన గాయమైనట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. రాజన్న ఆలయానికి కోడెమొక్కుల కోసం తీసుకువచ్చే కోడెలను దాడి చేసేవి కాకుండా సరైన కోడెలను ఎంపిక చేసి ఆలయానికి తీసుకురావాలిని, ఇలాంటి సంఘటనలు ఆలయంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న వృద్ధురాలు

క్యాన్సర్‌ను దూరం చేద్దాం

- చిన్నారులూ బాధితులే..
- నేడు చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

క్యాన్సర్ ఇప్పుడు మానవాళి ఆరోగ్య సమస్యల్లో ఒకటైపోయింది. ఎంతోమంది క్యాన్సర్ అనగానే జీవితమే ముగిసి పోయిందని మానసికంగా కృంగిపోతారు. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. కొన్ని రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉంది. క్యాన్సర్ బారిన పడి పెద్దలే కాకుండా చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. అందుకే క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించి చిన్నారులను రక్షించుకోవడానికి ప్రచార కార్యక్రమాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా మొదలయ్యాయి.

క్యాన్సర్ కొంతమంది కుటుంబాల్లో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వారు ముందుగా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పడడం అవసరమని చెబుతున్నా రు. క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా వందలో 24 సందర్భాల్లో పొట్టల్లో, అన్నవాహికలో వస్తున్నట్లుగా గుర్తించారు. 16 క్యాన్సర్లు ఊపిరితిత్తుల్లో, 15 క్యాన్సర్లు రొమ్ముకు, పేగులకు, ఊపిరితిత్తులకు దాదాపు 55సందర్భాల్లో క్యాన్సర్ వస్తున్నట్లుగా గుర్తించారు. వీటితో పాటు మూత్రకోశం, మూత్రపిండాల్లో 13, చర్మానికి 9, గర్భసంచి, అండాశయాల్లో, మిగతా అవయవాల్లో 14 శాతం క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్ వచ్చిన దాన్ని కనుక్కొని ఆపరేషన్ ద్వారా తొలగించడమనేది ఎంతో ఉపయోగపడుతుంది. ఆ తరువాత రెడియో థెరపీ, మందుల వాడకం వంటివి చేస్తే ఉపయోగం ఉంటుంది. క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంటుంది. పొగ తాగడం మానివేయాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తినాలని వైద్యులు చెబుతున్నారు.



ప్రపంచంలో ప్రతి ఏటా 2 లక్షల 50వేల మంది బాలబాలికలు క్యాన్సర్ బారినపడుతున్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశంలో 80శాతం బాలబాలికలు ఉన్నారు. వ్యాధిని గుర్తించకపోవడం వల్ల, తగిన వైద్య సదుపాయం అందకపోవడం వల్ల మృతిచెందుతున్నారు. క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్స చేస్తే కనీసం లక్ష మంది బాలబాలికల ప్రాణాలను కాపాడుకునే వీలు ఉంటుంది. అందుకే ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ పేరెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డేగా జరుపుతున్నారు. ఈ రోజున క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు అందుకు అవసరమయ్యే నిధులను కూడా సేకరిస్తారు.



హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు


స్తంభంపల్లిలో ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొన్న గ్రామస్తులు

వెల్గటూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఎడ్లబండ్ల పోటీలు అలరించాయి. ఈ పోటీలో గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామానికి చెందిన వెల్గటూర్ రమేష్‌కు చెందిన ఎడ్ల బండి ప్రథమ స్థానంలో నిలువగా అదే గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మణ్‌పావు తులం బంగారం అందజేశారు. జగదేవ్‌పేట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ద్వితీయ స్థానంలో నిలువగా జగిత్యాలకు చెందిన జీజీఎం పవన్ ఎనిమిది తులాల వెండిని అందజేశా రు. షేక్ ఇమ్రాన్, పత్తిపాక పెంటయ్యకు సంబంధించిన ఎడ్ల బండ్లు తృతీయ స్థానంలో నిలువగా స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాదం అన్విక్ పటేల్ నాలుగు తులాల వెండిని అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య, కమిటీ సభ్యులు గోరు వంతుల మహేష్, అన్నవేని మల్లేష్, యాగండ్ల రాజయ్య, అన్నవేని వెంకటేష్, రాపాక వెంకటేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా యాసంగి వరినాట్లు

ఏవో ఉమాపతి



ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి పంట సాగు చేశారు?

వ్యవసాయాధికారి: ప్రస్తుత సీజన్‌లో మండల పరిధిలో 13,800 ఎకరాల్లో వరినాట్లు వేశారు.

ఆంధ్రజ్యోతి: వానాకాలంలో సన్నరకం వరి దిగుబడి ఎంత.?

వ్యవసాయాధికారి: వానాకాలంలో 30వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో 93.531 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం ఉంది.

ఆంధ్రజ్యోతి: రైతులకు చెల్లించిన బోనస్ ఎంత.?

వ్యవసాయాధికారి: సన్నరకం ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం రూ.46.50 లక్షల బోనస్ చెల్లించింది.

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు అశ్రునివాళి



గోదావరిఖనిలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ, కాలనీ తెలంగాణ చౌక్‌లో నివాళులర్పిస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం సాయంత్రం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ర్యాలీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు 42మంది అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ పుల్వామా దాడిలో వీర మరణం పొందిన వీర సైనికుల మరణం వృథా పోదని, మీ త్యాగం మరవలేనిదన్నారు. మన భద్రతా దళాలు చూపించిన ధైర్యసాహసాలు, వారి తెగువ తరతరాలకు స్ఫూర్తిని స్తూనే ఉంటాయన్నారు. ఫిబ్రవరి 14 అంటే పాశ్చాత్య దేశాల సంస్కృతి పాటించే వాలెంటైన్ డే కాదని, భారత సైనికులు మరణించిన అమర జవాన్ల దివస్ అన్నారు. యువత దేశ రక్షణ కోసం భారత సైన్యంలో చేరాలని, దేశాన్ని రక్షించుకోవడం కోసం రక్షకులై పనిచేయాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి మేడగొని రవీందర్, బండ సమ్మన్న, కొండపర్తి లింగన్న, పున్నం అంజన్న, ములుకుంట శ్రీనివాస్, అడిగొప్పుల రాజు, మునిగాల సంపత్, బజరంగ్ దళ్ నగర కన్వీనర్ దిగంబర్, మ్యాడగోని అరవింద్, తిప్పర్తి శివ, మోహన్, కొరివి వెంకటేష్, బాలు, మద్దెల శ్రీనివాస్, నరేష్, దినేష్, గోటిక శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన సైనికు లకు శుక్రవారం బజరంగ్‌దళ్ కార్యకర్తలు నివాళులర్పించారు. తెలంగాణ చౌరస్తాలో జవాన్ల చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించి, రెండు నిమిషాలు పాటించారు. వీర సైనికుల త్యాగాలు వృథాగా పోవని, తరతరాలకు స్ఫూర్తిగా భద్ర తాబలగాల సేవలు నిలుస్తాయని నాయకులు పేర్కొ న్నారు. దావ రాజిరెడ్డి, కంబాల తిరుపతి, శివసాయి, రామంచి శ్రావణ్, అఖిల్, శశాంక్ పాల్గొన్నారు.

రామగిరి,(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో జరిగిన పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ఏర్పా టుకు కృషి చేసిన సుష్మాస్వరాజ్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఎంపీటీసీ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్, పట్టణఅధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు మేరుగు శ్రీకాంత్, రవీం దర్‌రెడ్డి, రాకేష్, ప్రభాకర్, హరీష్, ఉప్పు చారి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



అన్నయ్యగౌడ్, జీఎం లలిత్‌కుమార్‌లను సన్మానిస్తున్న లైబ్రేరియన్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ హామీ ఇచ్చారు. శుక్రవారం గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని గ్రంథాలయాన్ని సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. అన్నయ్యగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను సందర్శిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నానని, పాఠకులకు కావాల్సిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయం అభివృద్ధికి తనవంతుగా సహాయాన్ని అందిస్తానన్నారు. పాఠకులకు చదువుకోవడానికి రీడింగ్ చైర్స్ ప్యాడ్స్, వేసవికాలంలో దృష్టిలో పెట్టుకొని కూలర్స్ సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌లను లైబ్రేరియన్ భారతి శాలువాలతో సన్మానించారు.

చెస్ క్రీడాకారుడికి సన్మానం



సిద్ధార్థను సన్మానిస్తున్న సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు

ఓదెల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం ఓదెలకు చెందిన చెస్ క్రీడాకారుడు అరుకాల సిద్ధార్థను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఓదెలకు చెందిన అరకాల తిరుపతి కుమారుడు సిద్ధార్థ గోదావరిఖనిలోని గురుకుల పాఠశాలలో చదువుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చెస్ టోర్నీలో ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా సిద్ధార్థను పలువురు సన్మానించారు. భీష్మాచారి, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, మేర్గు సారంగం, క్యాతం వెంకటేశ్వర్లు, వేణు, గుండేటి కుమార్, రమేష్, క్యాతం మల్లేశం పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనే



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలను అణగదొక్కేందుకే కులగణన పేరుతో సర్వే చేపట్టిందని, ఈ సర్వేలో ఐదున్నర శాతం బీసీల జనాభాను కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. కులగణన అంతా తప్పుల తడకని, రాష్ట్రంలోని బీసీలకు న్యాయం జరిగేదాకా పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో చందర్ అధ్యక్షతన బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పరిపాలనలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ బీసీలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పని చేశారన్నారు. బీసీ బంధు పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై బీసీలను వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం మళ్లీ కుల గణన చేపట్టనుందన్నారు. బీసీలకు 42శాతం విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అమలు చేయాలని, బీసీ వర్గాలకు బ్యాంకు లోన్లు, సబ్సిడీలు ఆదాయపన్ను మినహాయింపు చేయాలని, ఓబీసీ మంత్రిత్వశాఖ శాఖను కేంద్రం ప్రభుత్వం ఒక ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలన్నారు. కార్యనిర్వాహక న్యాయ శాఖల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, రాజ్యాంగ సవరణ చేసి 50శాతం నిబంధన ఎత్తివేయాలని బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించారు. ఈ సమావేశంలో ఇజ్జగిరి భూమయ్య, రెడ్డి బాస్కర్, కనకరాజు, సదానందం ప్రశాంత్ ముదిరాజ్, రాంచెందర్, కిరణ్, దివాకర్, మహేందర్, సారన్న, కొమురయ్య, మందల వెంకటేష్, పోశం, ఎలేశ్వరం వెం కటేష్, జక్కుల తిరుపతి, గాండ్ల ఉమాశంకర్‌తో పాటు నాయకులు గోపు ఐలయ్య యాదవ్, రాజ య్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, అచ్చే వేణు, నూతి తిరుపతి, నారాయణ దాసు మారుతి, రమేష్, సట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి రూ.1కోటితో ప్రణాళికలు చేపట్టినట్టు కమిషనర్ అరు ణశ్రీ తెలిపారు. ప్రధానంగా పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.50లక్షలు, రూ.30 లక్షలతో లీకేజీల మరమ్మతు, రూ.20లక్షలతో బోర్‌వెల్ మెటీరియల్ కొనుగోలు, పాడైపోయిన బోర్ల మరమ్మతు చేయించనున్నట్టు తెలిపారు. సప్తగిరికాలనీ, రామగుండం, పీకే రామయ్య కాలనీల్లో పనులను ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

వెండి ఆభరణాల వితరణ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు నాగ లింగేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం వెండి ఆభరణాలను అందించాడు. రాగినేడు గ్రామానికి చెందిన యాదగిరి రాజయ్య - సంధ్య దంపతుల కూతురు పుట్టినరోజు సందర్భంగా స్వామి వారికి 25 తులాల వెండి నాగపడిగెను అందించారు. దాని విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు.

నియామకం



భూమయ్యకు నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా పెద్దకల్వల గ్రామానికి చెందిన బోల్ల బత్తుల భూమయ్యను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం భూమ య్యకు నియామక పత్రం అందించారు. భూమయ్య మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి కృషి చేస్తానని, తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటి పథకాలను వెంటనే అమలు చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సెంటినరీకాలనీలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో చేపట్టే నిరసన సభకు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. రాములు, చంద్రమౌళి, రవి, లక్ష్మి, రుక్మిణి పాల్గొన్నారు.

కోతుల బెడదపై ఎంపీడీవోకు వినతి

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల గ్రామంలో కోతులు, కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని శుక్రవారం ఎంపీడీవో శైలజారాణికి ముస్త్యాల గ్రామానికి చెందిన యువకులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పిచ్చికుక్కలు పలువురిని గాయపర్చాయని వినతిలో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కొరారు.

ఎన్నికలకు సహకరించండి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్‌టీసీ మజ్దూర్ సహకార గృహ నిర్మాణ సంఘం ఎన్నికలకు సహకరించాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సభ్యులంతా ఓటరు జాబితా తయారీకి ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, షేర్ సర్టిఫికెట్, కులం, చిరునామాతో ఏపీఎస్ ఆర్‌టీసీ మజ్దూర్ సహకార గృహ నిర్మాణంలో హాజరు కావాలని కోరారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



వీవో సభ్యులకు అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని, వాటిపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు మండలాలకు చెందిన మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల సంరక్షణ, బేటి బచావో బేటి పడావో, అంగన్‌వాడి సేవలు, బాల్య వివాహాలు అరికట్టడం, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖీ కేంద్రం సేవలను వివరించారు. డీఆర్‌డీఏ ప్రతినిధులు, ఐసీపీఎస్ బృందం సభ్యులు నిర్మల, కల్పన, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

23న ఖనిలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ

కమాన్‌పూర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సంపాదించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ సర్కార్ హరిస్తుందని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు మాతంగి రాయమల్లు, రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తూరి సదానందంలు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఈనెల 23న గోదావరిఖనిలో నిర్వహించే ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వ్యవస్థల వల్ల శ్రమదోపిడి తీవ్రం చేసిందన్నారు. కులం, మతం పేర ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. ఖనిజ సంపదను అంబాని, అదానిలకు కట్టబెట్ట డానికి కేంద్ర మంత్రి అమిత్‌షా ఆదివాసీ లపైకి పోలీసు బలగాలను, ప్రైవేట్ సైన్యాన్ని ఉసిగొల్పి నరమేధం సాగిస్తున్నారన్నారు. గోదావరిఖనిలో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సభను విజయవంతం చేయడానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. టి.రత్నకుమారి, కొలిపాక శంకర్, సాయికుమార్, రాజయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

సమ్మక్కసారలమ్మ జాతర

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతిపరులకు ప్రభుత్వ మద్దతు

గోదావరిఖని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతిపరులకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇస్తున్నదని బీజేపీ రాష్ట్ర నాయకులు అల్లాపురం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్కండేయకాలనీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తక్కువగా చేసి చూపించే ప్రయత్నం చేసిందని, ప్రజావ్యతిరేకత రావడంతో మళ్లీ కులగణన సర్వే చేపడుతుందన్నారు. కౌన్సిల్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ సమస్యలతో పాటు ప్రభుత్వాన్ని నిలదీయాలంటే బీజేపీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డిలను గెలిపించాలని పిలుపునిచ్చారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని నిలదీసే పరిస్థితి కాంగ్రెస్‌లో నెలకొంటుందన్నారు. నియోజకవర్గం ఇంచార్జీ కందుల సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు మెరుగు హన్మంత్‌గౌడ్, జనగామ భూమయ్య, సుభాష్, సురభి, నవీన్, ఆంజనేయులు, క్యాతం వెంకటరమణ, మహేష్, మచ్చ విశ్వాస్, రాకేష్, ప్రవీణ్, బుంగ మహేష్, పద్మ, అపర్ణ పాల్గొన్నారు.

ఖనిలో సుష్మాస్వరాజ్ జయంతి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ జయంతిని శుక్రవారం గోదావరిఖనిలో నిర్వహించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గం ఇంచార్జీ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో మార్కండేయకాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఏర్పాటుకు కీలక భూమిక పోషించారని కొనియాడారు. అరవింద్, భూమయ్య, విశ్వాస్, రాకేష్, రాజేందర్, బాలు, ఆకాష్, భాస్కర్, అపర్ణ, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రతుల దహనం

మంథని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సోషల్ జస్టిస్ బ్లాక్ డేగా శుక్రవారం మంథని నియోజకవర్గ మాల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో ఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఓట్ల కోసం ఒక కొమ్ముకాస్తుందని, మాలలు, ఉప కులాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. రాజలింగు, బండారి సమ్మయ్య, పోచమల్లు, స్వామి పాల్గొన్నారు.

యునాని ఆరోగ్య కేంద్రాన్ని పునఃప్రారంభించాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుట్నూర్ ఆరోగ్య కేంద్రంలో గతంలో ఉన్న యూనాని ఆరోగ్య కేంద్రాన్ని పునఃప్రారంభించాలని శుక్రవారం యువకులు వైద్యుడు సాయిసూర్యకు వినతిపత్రం అందించారు. కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య కేంద్రానికి తరలించారన్నారు. పునఃప్రారంభించి ప్రజలకు వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. రాజ్‌కుమార్,తుడూరి రాంబాబు గౌడ్,దుర్గం కుమార్, ప్రసాద్,బండారి సతీష్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

రామగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆదివారంపేటలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి హెడ్ కిరణ్ మాట్లాడుతూ గ్రామీణులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కోట కరుణాకర్, హరీష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను వేగవంతంగా చేయండి

ఎలిగేడు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులతో పాటు వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీవో ఎండి.ఆరీఫ్ అన్నారు. శుక్రవారం లోకపేట, నర్సాపూర్, ముప్పిరితోట గ్రామాలను సందర్శించి పారిశుధ్య పనులు, తాగునీటి బావులు, చేతిపంపులు, గేట్‌వాల్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓవర్ హెడ్‌ట్యాంకులు, తాగునీటి బావుల పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. గేటు వాల్స్, పైపులైన్లు లీకేజీలు ఉంటే మరమ్మతు పూర్తిచేసి తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పనులను పరిశీలిస్తూ పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. కార్యదర్శులు మసీయోద్దీన్, లలిత, శిరీష; సిబ్బంది తదితరులు ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సుల్తానాబాద్ లో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ కోర్టుకు చెందిన న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. రంగారెడ్డి జిల్లా తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తిపై ఓ నిందితుడు చెప్పు విసరడాన్ని ఖండిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పడాల శ్రీరాములు, జోగుల రమేష్ అన్నారు. న్యాయమూర్తులపై ఇలా దాడులు చేయడం హేయనీయమైన చర్య అన్నారు. భవిష్యత్తులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిపై దాడులు జరుగకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని, న్యాయవాదుల రక్షణ చట్టం కూడా తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వొడ్నాల రవీందర్, సరోత్తంరెడ్డి, కోడం అజయ్, తిరుపతిరెడ్డి సత్యనారాయణ, నర్సయ్య, శ్యామ్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు మృతి చెందగా కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు శుక్రవారం పరామర్శించారు. మంథని మాజీ సర్పంచ్ ఇనుముల సతీష్ తండ్రి శంకరయ్య గుండెపోటు మృతి చెందగా శంకరయ్య చిత్రపటానికి శ్రీనుబాబు, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. బోయినిపేటకు చెందిన మిర్యాల హర్షవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ నేతలు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, అయిలి ప్రసాద్, ముస్కుల సురేందర్‌రెడ్డి, అజీంలు పాల్గన్నారు.

ప్యాక్స్ పాలక వర్గానికి సన్మానం

మంథని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంథని పీఏసీఎస్ పాలక వర్గ పదవీ కాలంలో ముగుస్తుండటంతో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నివాసంలో ఆయన సోదరుడు శ్రీనుబాబు శుక్రవారం పాలక వర్గాన్ని సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలను పాలకవర్గం రైతులకు అందేలా కృషి చేసిందన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు, నేతలు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి, రావికంటి సతీష్, పేరవేన లింగయ్యయాదవ్, అజీంఖాన్, రాజు, కోటేష్‌లు పాల్గొన్నారు.



నీటి తరలింపునకు జీఎం పరిశీలన

గోదావరిఖని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా రామగుండం ఏరియాలోని సింగరేణి కాలనీలలో ఉద్యోగుల నివాసాలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయం కోసం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ మూసివేసిన మేడిపల్లి ఉపరితల గనిని శుక్రవారం సందర్శించారు. క్వారీలో స్టోర్ అయిన నీటిని పరిశీలించారు. నీటిని కాలనీలకు సరఫరా చేయడానికి అవసరమైన ప్రణాళికలు పరిశీలించారు. త్వరలో క్వారీలోని నీటిని కాలనీలకు సరఫరా చేయుటకు కావలసిన ఏర్పాట్లపై చర్చించారు. ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఎస్‌ఈ(సివిల్) వర ప్రసాద్, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్ ఉన్నారు.

రిటైర్డ్ కార్మికులకు పెరిగిన పెన్షన్ అమలు చేయాలి



సీఎంపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో పెరిగిన పెన్షన్లను అమలు చేయాలని టీబీజీకేఎస్ నాయకులు సీఎంపీఎఫ్ కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్‌లతో సీఎంపీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. జూలై 2021 నుంచి పెరిగిన పెన్షన్ అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు నోచుకోలేదని తెలిపారు. రిటైర్డ్ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెరిగిన పెన్షన్ సత్వరం అమలు చేయాలని కోరారు. 44 నెలల ఏరియర్స్ చెల్లించాల్సి ఉంటుందని, దీనితో ఒక్కొక్కరికి మూడు నుంచి ఆరు వేల వరకు పెన్షన్ పెరుగుతుందని తెలిపారు. 1.20 లక్ష నుండి 2.30 లక్షల వరకు ఏరియర్స్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బేతి చంద్రయ్య, నరేష్, శంకర్ ఉన్నారు.

ఇండస్ట్రియల్ పార్కుకు భూములు ఇవ్వం

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేడిపల్లి శివారులో గల భూములను ఇండస్ట్రియల్ పార్కుకు ఇవ్వమని గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రాలు అందజేశారు. 2008లో 150 ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని మళ్లీ 250 ఎకరాలు తీసుకోవడానికి నిర్ణయించిందన్నారు. గ్రామంలో ప్రతీ ఒక్కరు వ్యతిరేకంగా ఉన్నామని వినతిలో పేర్కొన్నారు. గతంలో రైల్వేలైన్, గ్యాస్‌పైప్‌లైన్, టవర్‌లైన్, ఎల్లంపల్లి పైప్‌లైన్ పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల భూములను స్వాధీనం చేసుకుంటే ఉరుకొనే ప్రసక్తే లేదన్నారు. మాజీ ఎంపీటీసీ దర్శుల రాజసంపత్, కొండు లక్ష్మణ్, బాద్రాపు ప్రశాంత్, కొప్పూరి సురేష్, బొంగురాల రవి, కృష్ణ, బర్లవెంకన్న, శంకర్, రైతులు పాల్గొన్నారు.

జాడలేని నీటి సంఘాల ఎన్నికలు



- కరువైన చెరువుల పర్యవేక్షణ
- ఆక్రమణకు గురువుతున్న చెరువులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెరువుల అభివృద్ధికి గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం చేపట్టింది. అయితే అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టు నీటి సరఫరా నిర్వహణకు నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించ లేదు. 15ఏళ్లుగా సంఘాలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో చెరువుల పర్యవేక్షణ కరువైంది. దాంతో అవి ఆక్రమణకు గురువుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలో గుండారం రిజర్వాయర్, కమాన్‌పూర్ పెద్దచెరువు ఉన్నాయి. నీటి సంఘాల ఎన్నికలు లేక పర్యవేక్షణ కరువైంది. పెద్దచెరువు ఆక్రమణకు గురైందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వేసవిలో చెరువు మట్టిని నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 2003లో ఉమ్మడి రాష్ట్రంలో వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటిసంఘాల ఎన్నికల ఊసేలేదు. నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటిసంఘం కమిటీ ఏర్పాటుచేయాలి

పొన్నం రాజేశ్వరి (రైతు)కమాన్‌పూర్



చెరువులను పరిరక్షించేందుకు నీటిసంఘం కమిటీలను ఏర్పాటుచేయాలి. గతంలో కొందరు కమాన్‌పూర్ పెద్దచెరువు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు చెరువు మరమ్మతు పనులను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. వేసవిలో అక్రమార్కులు చెరువుల నుంచి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల పర్యవేక్షణకు కమిటీలు వేసేలా చర్యలు చేపట్టాలి.

ఆదేశాలు వస్తే నిర్వహిస్తాం

వాసంతి, తహసీల్దార్



సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నోటిఫికేషన్ జారీ చేసి, సంఘాలను ఎన్నుకుంటాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. ప్రస్తుతం సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో ప్రక్రియ చేపట్టడం లేదు.